# తల్లీ నిన్నుదలంచి

రాజ్యలక్ష్మి వాళ్ళు నరసాపూర్‌లోనే ఉన్నారన్న వార్త చెవినిపడగానే నా మనసు అక్కడే కట్టిపడేసినట్లయింది. వెంటనే మరోరోజు లీవు పొడిగించమని రిక్వెస్ట్ చేస్తూ హెడ్డాఫీసుకి ఓ అర్జెంట్ టెలిగ్రాం కొట్టేశాను. నేచురల్ గాస్‌కి సంబంధించిన ఆ మీటింగ్ పూర్తయి డిన్నర్ కూడా అయ్యిందనిపించి పక్క మీదకు ప్రాణిని చేర్చేసరికి రాజ్యలక్ష్మి జ్ఞాపకాలు కంటిమీద కునుకు రాకుండా చేశాయి నాకు.

అంత రాత్రివేళ ఊరంతా తిరిగి దాన్ని పట్టుకోవాలన్నంతగా నా మనసు మారాం చేసింది.

ఎప్పటి రాజ్యలక్ష్మి. దాన్ని కళ్ళతోనే చూసి ఏ ఇరవయ్యేళ్ళు అయిందో, పాతికేళ్ళే దాటిందో. నాకుచెల్లెళ్ళూ లేరు, దానికి అన్నలూ లేరు. మా చిన్నాన్న చిన్నతనంలో కేన్సరుకు గురైతే పోయే ముందు దాని బాధ్యతని మా నాన్నకి అప్పజెప్పేశాడు. పదకొండేళ్ళకు మా ఇంటికొచ్చిన రాజ్యలక్ష్మి పెళ్ళై అత్తవారింటికి వెళ్ళిపోయే దాకా మా ఇంట్లోనే వుంది.

దాని సంరక్షణ బాధ్యత ఏదో మేం నెత్తిన వేసుకున్నామనుకోడం నిజానికి ఆత్మవంచన. మా ఇంటిని తీర్చిదిద్దే పెద్ద బరువంతా అదే చిరునవ్వుతో స్వీకరించి అంత చిన్నవయసులోనే ఎంతో జయప్రదంగా నిర్వహించింది.

పరాయి ఇంటి ఆడపిల్లని తెచ్చుకుని గుండెలమీద కుంపటి పెట్టుకునే అనవసరపు తద్దినం మొదట్నుంచీ మా అమ్మకి ఇష్టం ఉండేదికాదు. వీలైనంత వరకూ అడ్డుపడి తప్పని పరిస్థితుల్లో తల ఊపింది అంతే. ఆవిణ్ణి అనడానికి లేదు. మావి బొత్తిగా పూట బత్తెం, పుల్లి వెలుగూ

సంసారాలు. పేరుకి నేను ఒక్కణ్ణేగానీ నన్ను కన్నదగ్గర్నుంచీ మరి అకాను పులో ఏం అడ్డదిడ్డమైందో మా అమ్మకి నడుం నొప్పి పట్టుకుంది. వయసు గడచిన కొద్దీ అది పెరిగి రాజ్యలక్ష్మి మా ఇంటికి వచ్చేనాటికి మంచాన పడేసింది. ఆవిడ వైద్యానికే ఎక్కన్లేని డబ్బూ చాలక ఇంట్లో ఏ నాడూ రామరావణ యుద్ధమే అయిపోయేది. మా కాస్తపాటి భూమి మూడేళ్ళ పాటు కరువుకు గురై తిండి గింజలకే కటకట చేసేసింది. ఆ రోజుల్లోనే అన్యాయంగా మా నాన్నకి సస్పెన్షన్ ఆర్డరు వచ్చి రెండేళ్ళపాటు ఇంటిల్లి పాదిమీ తీవ్ర ఆందోళనకి గురయ్యాము. మామూలు దృష్టితో చూస్తే మా అమ్మ చెప్పినట్టు రాజ్యలక్ష్మిని తెచ్చి ఇంట్లో పెట్టుకోవడం నేలని తీసి నెత్తికి రాసుకోడమే. అనుమానంలేదు. అసలు మొట్టమొదట్లో మా పిన్ని పోయినపుడే మా చిన్నాన్నకి కూతుర్ని తీసుకుని మా దగ్గరకు ఏకంగా వచ్చెయ్యమంటే జరిగేదేదో, జరగందేదో మరిదికి చాటుగా బోధపరిచి మా అమ్మే అడ్డుపడిందని మా నాన్న గొణుక్కునేవాడు.

ఇంతకీ తమాషా ఏమిటంటే వచ్చిన నెల్లాళ్ళకే రాజ్యలక్ష్మి అంత చిన్నపిల్లా మమ్మల్నందర్నీ మా అమ్మతో సహా 'ఇన్నాళ్ళూ ఎలా బతికాం? ఇది లేపోతే ఇప్పుడేమైపోతాం?' అనే స్థితికి చేర్చెయ్యడమే!

పెరుగూ, పాలూ పోసి చద్దెన్నాలు మేపి ఆ రోజుల్లో వాళ్ళమ్మ ఆ పల్లెటూళ్ళో ఏం పెట్టి పెంచిందోగానీ పన్నెండేళ్ళకే ఎంతో ఏపుగా ఎదిగింది రాజ్యలక్ష్మి. అందచందాలు మాత్రం అంతంత మాత్రమే. నాకు ఇంజనీరింగులో సీటు వస్తేనే ఓ పట్టాన ఒడంబడనంత అతి సామాన్య గృహస్తు మా నాన్నకి ఇక పైపిల్లకి స్కూల్లో జీతాలు కట్టే స్తోమత ఎక్కడిది? ఇంతగా వివరించి ఎందుకు చెబుతున్నానంటే మా ఇంట్లో అడుగు పెట్టిందగ్గర్నుంచీ వంటపనికీ ఇంటిపనికీ ఆనందంగా అంకితమై పోయింది రాజ్యలక్ష్మి.

ఇంజనీరు చదువు మొదటేడు సెలవుల్లో ఇంటికొచ్చినపుడు ఇంట్లో దాని ప్రభావం గుర్తించి మతిపోయినంత పనైంది నాకు. మంచంమీద చేరిన మా అమ్మ ఒక్కర్తెకే కాదు ఇంట్లో ఎవరికేం కావలసినా అది అందించవలసిందే. అంతకు ముందు మా ఇంట్లో అంట్లపనికి దాసీది ఉండేది. చాకలికి బట్టలు వేసుకునే వాళ్ళం. మనలాంటి సామాన్యులం,

అందులో బొత్తిగా ఇంత చిన్న కుటుంబం మన పనులు మనమే చేసు కోవచ్చు అనే స్థితికి తను మొదట చేరుకుని ఇంట్లోవాళ్ళనీ క్రమక్రమంగా చేర్చినట్టుంది రాజ్యలక్ష్మి.

'ఇంత వార్చి వడ్డించడానికే నా నడుం విలవిలలాడిపోతుంది. ఏదో మరో దిక్కులేక మగాళ్ళు చెయ్యికాల్చుకుంటుంటే చూసి ఊరుకోలేక ప్రాణం ఉగ్గబట్టుకుని చేస్తాను గానీ ఇంత ముద్ద మింగి ఎపుడు మంచం మీదకి చేరేద్దామా ఈ శరీరాన్ని అనిపిస్తూ ఉంటుంది నాకు' అనేది అమ్మ. అలాంటిది మామూలు వంటకాక, అన్నీ ముందుగా రాజ్యలక్ష్మి అక్కడ అమరుస్తే యేంగాక సన్న సెగని గంటలకొద్దీ వేగే చేగోడీల లాంటి పిండివంటలకి కూడా సిద్ధపడిపోతోందంటే ఏం చెప్పను. అంతకు ముందు మా నాన్న తన తాలూకా కచేరీలో గుమస్తా పని తప్ప ఇంట్లో అటు వస్తువు ఇటు పెట్టడం నేనెరుగను. ఇపుడు పెరట్లో చిన్నకిచెన్ గార్డెన్ లాంటిది శ్రద్ధగా పెంచుకున్నారంటే ఏం అనుకోను. ఎవరిమాటో ఎందుకు ఆ మూడు నెలల సెలవులూ ఖర్చయితే అయింది నేను పూర్‌గా ఉన్నా ఓ ఇంజనీరింగు బ్రాంచిలో కోచింగ్ పెట్టించుకుందామంటూ ఆ ఊరు చేరిన వాడిని నేనే ఇంట్లో ట్యూషన్లు పెట్టి కొంత సంపాదించగలి గానంటే ఎలా అర్థం చేసుకోవాలి! మా అందరి కంటే చిన్నదొకర్తి మా ఇంట్లో చేరి వచ్చిన రెండు మూడేళ్ళలోనే మా పెద్దవాళ్ళ బూజు ఒకటీ ఒకటీ దులపగలిగిందంటే అంతకన్నా చైతన్యమూర్తి ఎక్కడుందనుకో వాలి.

పరిశీలించి చూస్తే రాజ్యలక్ష్మిలో చెప్పుకోదగ్గ గుణాలు ఒకటి రెండు బయటపడతాయి. ఎందులోనూ తనకు తానుగా కలగజేసుకోదు. ఆ కొద్ది మాటలు మాటాడినపుడన్నా చేతిలోపని వదిలిపెట్టదు. ఎట్టి పరిస్థితిలోనూ ముఖాన చిరునవ్వు చెదరనివ్వదు. ఇలాంటివి అరుదైనంత కాలం అవి ఉన్నవాళ్ళదే పైచెయ్యి.

నా చదువిలా పూర్తయిందో లేదో అలా నాకు బొంబే హైవేలో మంచి ఉద్యోగం దొరికింది. అప్పటికే నాన్న రిటైరై రెండేళ్ళు దాటింది. మా బాస్ హృదయమున్న వాడవడం నా మరో అదృష్టం. ఇలా ఓల్డ్

పేరెంట్స్ ఉన్నారని తెలీగానే ఓ ఫ్రెండు సాయంతో మేమంతా ఉండ డానికి క్వార్టరు కూడా చూసి పెట్టాడు.

వాళ్ళని తీసికెళదామని ఓ పదిరోజులపాటు నేను శలవు పెట్టి వచ్చి నప్పటి మాట. 'పాపిష్టిదాన్ని ఇది నా కెక్కడ బరువైపోతుందో అని మొదట్లో గోలపెట్టాను. మాటవరసకైనా ఆ మాట మనసులో పెట్టు కోకుండా కన్నకూతుర్ని మించి చూసుకుంది. దీన్ని వదలి పెట్టి ఎలా బతగ్గ లనో బోధపడ్డంలేదు-'

అంటూ మా అమ్మ కళ్ళనీళ్ళు పెట్టుకుంటే ఆశ్చర్యంగా చూశాను.

'మాతో పాటు అదీ మనతో వస్తుంది కదుటే అమ్మా, వదిలి పెట్టి అదెక్కడికి పోతుంది. అదీగాక మనం వెళ్ళేది మహాపట్టణం. మా ఆఫీ సుకి ఆనుకునే అన్ని సదుపాయాలూ ఉన్న పెద్ద ఆసుపత్రి ఉంది. నువ్వూ నాన్న పెద్దవాళ్ళయిపోయారు. రోజురోజుకీ నీ నడుం నొప్పి ఎక్కువై పోతోంది. అక్కడ పెద్ద డాక్టర్లకి చూపిస్తాను నిన్ను. నిన్ను కంటికి రెప్పలాచూసుకోడానికి ఇది ఉండనే ఉంది ఇంకేం?

ఒరే! నానీ రాజుకి ఇరవై ఏళ్ళు కూడా దాటాయి. నా చాకిరీ కోసం దాని పెళ్ళి చెయ్యకుండా అట్టే పెట్టుకున్నాననే బంధునింద ఇంకా ఎన్నాళ్ళు భరించమన్నావ్? కలసి రాలేదుగానీ మీనాన్న చేస్తున్న ప్రయ త్నాలకి ఏ నాడో పెళ్ళయిపోవలసింది దానికి.

పాతికేనా రాకుండా ఈ కాలంలో కూడా ఆడపిల్లలకి పెళ్ళేమి టమ్మా. చురుకైంది గనక మనింటికొచ్చి అక్షరాలు మొదలెట్టి ఇట్టే బియ్యే పాసైంది. అక్కడికి తీసికెళ్ళి దాన్ని పై చదువుల్లో పెడతాను.

అంటూ నేనెన్ని చెప్పినా మా అమ్మతో పాటు నాన్న కూడా విన లేదు. నా చదువుకి మా ఇంటిమీద తెచ్చిన అప్పు నెలనెలా కట్టలేక బేరం పెట్టి ఆ మధ్యనే అమ్మేశారు. అప్పు తీర్చెయ్యగా ఓ పాతికవేలు మిగి లింది. ఆ రోజుల్లో పాతికవేలల్లో కాస్తంత మంచి సంబంధమే వచ్చేది. దానితో అయిందనిపించి రాజ్యలక్ష్మిని సాగనంపితే తమ్ముడి కిచ్చిన మాట అలా ఉంచి అది చేసిన చాకిరీకి కొంతైనా రుణం తీర్చుకున్నట్లు ఉంటుం దని నాన్న అభిప్రాయం. ఇద్దరూ కలిసి అలా నా మాట కొట్టిపారేస్తూంటే

ఏం అనలేక దానికి నచ్చచెప్పబోయాను. దానిసమాధానం వింటూంటే ఈ ప్రసక్తి దీని దగ్గర తేకపోతే ఎంత బావుణ్ణనిపించింది.

'అనాథని తెచ్చి ఇంత ఆదరువు కల్పించి పెంచి పెద్దచేశారు. ముఖ్యంగా పిన్ని చూపిన ఆదరణ నా చర్మాన్ని చెప్పులతో కుట్టించినా తీర్చుకోలేను. పిన్నీ బాబాయిల కంటే మన మంచి చెడ్డలు చూసే వారెవరురా నానీ! నాకు రావలసిన చదువేదో వాళ్ళ పెంపకంలోనే వచ్చింది. ఇంకా దేనికి. వాళ్ళకు అడ్డురాకు. అంతకన్నా నా క్షేమం కోరే వారెవరు. నువ్వెంతో శ్రద్ధ చూపించి ప్రోత్సహించి పుస్తకాలు అవీ పంపబట్టే ఏదో విధంగా గ్రాడ్యుయేట్‌ని అవగలిగాను.'

'అవన్నీ అలా ఉంచి నే చెప్పేది విను.'

'ముందిది విను. మనవాళ్ళు పెద్దవాళ్ళయిపోయారు. వీలైనంత తొందర్లో నా పెళ్ళి చేసి తర్వాత ఏడాది తిరక్కుండా నీకూ ఏదో సంబంధం చూసి ముడెట్టించేద్దామని ఆతృతగా ఉన్నారు. అర్ధం చేసుకోరా నానీ!'

అంది నా రెండు చేతులూ పట్టుకుని. ఆ తర్వాతన్న మాటలు అసలు మరిచిపోలేను.

'ఎప్పుడైనా ఎక్కడైనా మనం ఇలాగే కలుసుకుంటూ ఉండాలిరా నానీ! రేపొద్దున నాకు పెళ్ళవుతుంది. ఆ తర్వాత నీకూ అవుతుంది. మా ఆయన్ని తీసుకుని బొంబాయి వచ్చి మీ ఆవిణ్ణి చూపిస్తాను.

"అదేమిటే నా పెళ్ళికి నువ్వురావా ఏమిటే రాజూ!"

హాస్యానికి ఏదో అప్పుడలా అన్నానుగానీ అలాగే జరుగుతుందని కలలో కూడా అనుకోలేదు.

ఏడాది తిరక్కుండానే రాజ్యలక్ష్మికి పెళ్ళి చెయ్యగలిగారు మావాళ్లు. నా మటుకు నేను జీతంలోంచి ఎడ్వాన్సు తీసుకుని ఓ అయిదువేల దాకా బంగారం రూపాన రాజ్యలక్ష్మికి ముట్టచెప్పాను. మా బావ రామ్మూర్తి చూడ్డానికి బాగుంటే దాని అదృష్టమని అందరం మురిసిపోయాం. అదెంతటి మేడిపండంటే మేం పెట్టే పెట్టుపోతలే తప్ప మా నీలినీడలు కూడా మా బావకి గిట్టవు. ఆ తర్వాత రెండేళ్ళకి వాసంతితో నా పెళ్ళయినపుడు మా నాన్న స్వయంగా వెళ్ళి పిలిచినా వాళ్ళత్తగారు నానా మాటలూ అనడం

తప్ప పెళ్ళికైనా రాజ్యలక్ష్మిని పంపింది కాదు. మా నాన్న ఊరుకోలేక అడిగారట.

'కలిగిన దానికన్నా ఎక్కువే పెట్టాం. ఏ తప్పు చేసేమమ్మా?'

'చాల్లేవయ్యా! పెళ్ళాం చాకిరీకని కాణీ ఖర్చు లేకుండా పడుంటుందనీ పిల్లదాన్ని మోసం చేశారు. పోనీ అక్కడికేనా మీరు తృప్తిపడి మా కోడలి ఆస్తి దాని మొహాన్న తగలేశారా? మీ పిత్రార్జితమైన మీ ఇంట్లో మీ తమ్ముడి కూతురి వాటా ఏమైంది? దాన్నంతా నీ కొడుకు చదువుకి తాకట్టు పెట్టి రెండులక్షల కొంపకీ దాని వాటా ఓ పాతిక తగలేసింది చాలక 'ఎక్కువే పెట్టాం' అని తెగ నీలుగు ఒకటా!'

మా ఇల్లు ఉండే జాగా మాత్రమే పిత్రార్జితం. దాంట్లో ఇల్లు కట్టించుకుంటానని మా చిన్నాన్న పర్మిషను పొంది మరీ నాన్న ఇల్లు కట్టేరు. చిన్నాన్న వాటాకి ఎంత డబ్బు వస్తుందో బేరీజు వేయించి నాన్న ఆనాడే పంపేశారు. అన్నిటికీ కాగితాలున్నాయి. కానీ ఎలాంటి కాగితాలూ కారు కూతలకి సాటిరావు కదా! నాన్న నోరెత్తకుండా తిరిగి వచ్చేశారు. తనకి అవమానం జరిగిందనికాదు, ఇలాంటి దిక్కుమాలిన ఇంట్లో పిల్లని పడేశామనే వేదనతో.

ఆ తర్వాత రాజ్యలక్ష్మినుంచి మాకు ఉత్తరం వచ్చింది. ఆవిడ అత్తగారు స్వతహా మంచిదేననీ, కిట్టనివాళ్ళు లేనిపోనివేవో ఎక్కించారు కాబట్టి, ఆ మాటతీరు అంతే కాబట్టీ తప్ప ఆ మనసు చాలా మంచిదనీ, తనకే లోపం లేదనీ, పెళ్ళికి వద్దామని బయల్దేరినా ఆవేళకి బాగా జ్వరం వచ్చి రాలేకపోయాననీ....

ఇలా సవాలక్ష అబద్ధాలని స్పష్టంగా తెలిసిపోతూ....

వీళ్ళంతా అదోరకమనీ ఉత్తరాలు రాసుకోడం, మనుషులు వచ్చిపోవడం వీళ్ళు అట్టే ఇష్టపడరు గనుక తనే వచ్చి వెళతానని రాస్తూ ముగించింది.

ఆ ఉత్తరం ఆఖరి ముక్కలు చదువుకుని కుమిలి కుమిలి ఏడ్చింది మా అమ్మ. దూరభారం అయిపోయింది. కళ్ళతో చూసుకోడానికి ఎలాగూ లేదు, క్షేమ సమాచారాలు చెవినపడే అవకాశమే లేదా అని....

ఆ హైక్లాసు హోటల్‌రూం ఫోం బెడ్డుమీద అటూ ఇటూ పొర్లు తుంటే దశాబ్దాల కిందట జరిగిన సంగతులు నిన్నా మొన్న జరిగినట్టు అని పించాయి. ఈ మధ్యకాలంలో అమ్మా నాన్న ముసలి వాళ్ళు అయిపో యారు. ఈ మధ్యనే మా రెండో అమ్మాయికి పెళ్ళిచేసి పంపించాం. అబ్బాయి ఎంబిఎ ఫైనల్లో ఉన్నాడు.

బావకూడా రిటైరు అయిపోయాడనీ, వాళ్ళబ్బాయికి నర్సాపూర్ ట్రాన్స్‌ఫర్ అయిందనీ ఒక్కడే కొడుకు గనుక వాళ్ళ దగ్గిరే బావా రాజ్యలక్ష్మి స్థిరపడ్డారని తెలిసింది. ఇన్నేళ్ళయిపోయాక ఇంకా పాత పగలు మనసులో పెట్టుకుంటారా. పోనీ తిడితే తిట్టనీ ఓ ఆప్తురాల్ని చూసినట్టేనా ఉంటుందని ఆ మర్నాడు వీధి వీధి తిరిగి వాళ్ళిల్లు ఎలాగో పటుకోగలిగాను.

ఇంచుమించు పాతికేళ్ళు గడిచినా అంతటి విపత్కర పరిస్థితిలో, అంతటి నిత్య నూతనత్వం మరి ఏ సాధనతో ఎలా నిలబెట్టుకోగలిగిందో అదే మెత్తని స్పర్శ, అదే చల్లని నవ్వు. 'పిన్నీ, బాబాయ్ బావున్నారా! ఎన్నేళ్ళయిపోయిందిరా నానీ నిన్ను చూసి అంటూ రెండు చేతులూ పట్టు కుంది.

అంతకుముందే మామగారు లేరు. అత్తగారుపోయి రెండేళ్ళయి పోయిందట. మొగుడికి ఇంటిపట్టున తోచదట. కొడుక్కే కాదు కోడలికి కూడా పనిట. ఇద్దరూ పొద్దుట ఎనిమిదిన్నరకి బయల్దేరుతారట. కోడలు చీకటి పడకుండా ఇల్లు చేరుతుందట. కొడుకు ఏ తొమ్మిదింటికో గానీ రాలేడట. ఆరేళ్ళ మనవడినీ రెండేళ్ళ మనవరాలినీ సాకుతూ అన్నీ చూసు కుంటూ రాజ్యలక్ష్మి ఇంటి పట్టునే ఉంటుంది. అలా ఏదో చేస్తూనే ఉంది. మనవల పని చూసుకుంటూనే ఉంది. నాకేం ఇష్టమో ప్రత్యేకించి చేసి వడ్డి స్తూనే ఉంది. ఇంకా అన్ని పనులు చేసుకుంటూ అలా కబుర్లు చెపుతూనే ఉంది. చిరునవ్వులు చిందిస్తూనే వుంది.

పిల్లలిద్దరికీ అన్నాలు పెట్టి కథలు చెప్పి పడుకోబెట్టాక నాతో అంది.

'వీళ్ళిద్దరే కాదు. పేరుకి పెరిగిన పెద్దవాళ్ళుగా కనిపిస్తున్నా,

ఊళ్ళోకెళ్ళిన మా ఇంట్లో మరి ముగ్గురూ ఇంత చిన్నవాళ్ళే అనిపిస్తూ ఉంటుంది నాకు.'

ఆ మాటకి త్రుళ్ళిపడ్డాను నేను. వీళ్ళు ముగ్గురే కాదు. నేనూ మా శ్రీమతీ ఎదిగిన మా పిల్లలూ ఆఖరికి పండు ముసలివాళ్ళైన మా అమ్మనాన్నా కూడా అంతో ఇంతో ఈ కోవలోకే చేరుతారనిపించింది నాకు. మా మాట అలా ఉంచి ఆ తర్వాత నా కళ్ళతో నేను చూసింది చెబితే మా బావ ఇరవై నాలుగు గంటలూ పరిశ్రమించే పేకాటరాయుడు. రాజ్యలక్ష్మి కొడుకు ఉద్యోగస్తుడే గానీ పచ్చితాగుబోతు. కోడలు ఉద్యోగం చేస్తున్న మాట నిజమేగానీ వల్లమాలిన గర్వం. ఇలాంటి ఇంకో అన్ని అన్ని అవలక్షణా లుండి తమ స్వార్థమే తమకి తోచిందే తప్ప మరొకటి లేదనుకునే వారంతా రాజ్యలక్ష్మి 'కంటికి చిన్నపిల్లలే. పేచీలు, పంతాలు పేలాపనలూ పిల్లలు కాక పెద్దవాళ్ళు చేస్తారా. అందుకనే వీళ్ళ మీద ఎటువంటి ఫిర్యా దులూ ఉండవు మూర్తీభవించిన మాతృమూర్తులకు.

దాని కాపరం చూసి ఏం బాధపడతానో అనుకున్నవాణ్ణి ఎంతో తృప్తితో తిరిగొచ్చాను. దారి పొడుగునా చిరునవ్వుల ఆ తల్లి మొహం నన్ను వెన్నాడుతూనే ఉంది. బాధలొస్తే తట్టుకోవాలి. దేనితో అయినా సర్దుకుపోగలగాలి. లభించిన దానితోనే స్వర్గం నిర్మించుకోవాలి అనుకునే స్థితప్రజ్ఞులకి కాక మరెవరికి ఆ చిరునవ్వు కానుక!